ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచాలి : డీపీవో

చంద్రుగొండ/ అన్నపురెడ్డిపల్లి, మార్చి 25 : ఉపాధిహామీ పథకం పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి మండల అధికారులను ఆదేశించారు. మంగళవారం చంద్రుగొండ మండలం తుంగారం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో రైతులు తమ పంట చేనుల్లో, వ్యవసాయ బోరుబావుల వద్ద ఫారంపాండ్స్‌ను నిర్మించుకోవాలన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఆయన వెంట ఎంపీవో ఖాన్, టీఏ రాము, సెక్రటరీలు, ఫీల్డ్ అసిసెంట్లు పాల్గొన్నారు. అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన, పెద్దిరెడ్డిగూడెం గ్రామాల్లో పర్యటించిన డీపీవో ఇంకుడుగుంతల నిర్మాణాలను పరిశీలించారు. ఎంపీవో షబ్నా, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు
మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు

వంటావార్పులో కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెం అర్బన్, మార్చి 25 : జర్నలిస్టులు చేస్తున్న వంటావార్పు ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీ తరపున తన సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బస్టాండ్ సెంటర్‌లో జర్నలిస్టు వంటావార్పు కార్యక్రమానికి వచ్చి తన సంపూర్ణ మద్దతు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలోనే జర్నలిస్టులకు ఉచితంగా స్థలాన్ని మంజూరు చేసిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు వనమా రాఘవ, కాపు సీతాలక్ష్మి, దామోదర్ యాదవ్, శాంతి, వెంకటేశ్వర్లు, అన్వర్‌పాషా, వేణు, రుక్మాంగధర్, ప్రసాద్, బుచ్చయ్య, సత్యం, సత్యనారాయణ, సాధిక్‌పాషా, నవతన్ పాల్గొన్నారు.

ఆకాశవాణి వార్షికోత్సవ వేడుకలు

శ్రోతలను సన్మానిస్తున్న దృశ్యం

రామవరం, మార్చి 25 : ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రం ఆవిర్భవించి 37 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం వార్షికోత్సవ వేడుకలు రేడియో స్టేషన్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. స్టేషన్ ప్రోగ్రాం హెడ్ బైరి శ్రీనివాసన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రోతలతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. శ్రోతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొలిపాక శంకర్‌రావు, బాబుసింగ్, ప్రసాద్, స్వామి, సిబ్బంది జాకీ పాల్గొన్నారు.

గిరిజనుల సంస్కృతికి వేదిక 'ట్రైబల్ మ్యూజియం'

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : భద్రాచలంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుతో గిరిజనుల గొప్ప సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి మరింత అవకాశం ఏర్పడిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాచలం ట్రైబల్ మ్యూజియం బ్రోచర్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని శాసనసభ ఆవరణలో మంత్రి దనసరి అనసూయ సీతక్కతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రాహుల్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావ్, పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి
మృతుల్లో హనుమకొండ జిల్లాకు చెందిన సుధీర్
డీకేఎస్‌జడ్‌ఎంగా ఉన్న అతడిపై రూ.25 లక్షల రివార్డు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 25 : భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ-బీజాపూర్ సరిహద్దుల్లో మంగళవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను దంతేవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ వెల్లడించారు. దంతేవాడ జిల్లా సరిహద్దు గీదమ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గిర్సపార, నెల్‌గోడ, బోడ్గా, ఇకేలి గ్రామల్లో మావోయిస్టులు ఉన్నట్లు పోలీస్ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో దంతేవాడ జిల్లా రిజర్వు గార్డ్స్(డీఆర్‌జీ), బస్తర్ ఫైటర్స్ సంయుక్తంగా ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులకు దిగడంతో తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఎదురుకాల్పుల్లో మృతిచెందిన ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన ఆయుధ, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు(డీకేఎస్‌జడ్‌ఎం) సుధీర్ అలియాస్ సుధాకర్ అలియాస్ మురళితోపాటు ఎస్‌జడ్‌ఎంలు మన్ను బార్సా, పండరూ అతర్ ఉన్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. సుధాకర్ వరంగల్ ప్రాంతానికి చెందినవాడిగా పోలీసులు గుర్తించారు. ఇతడిపై ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. ఈ సందర్భంగా బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజు పాటిలింగం మాట్లాడుతూ గడిచిన 83 రోజుల్లో 100 మంది హార్డ్‌కోర్ మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

నీటి ఎద్దడి నివారణకే ఫారంపాండ్
కలెక్టర్ జితేశ్ వి పాటిల్

పశువుల షెడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్, అడిషనల్ కలెక్టర్ విద్యాచందన

టేకులపల్లి, మార్చి 25: రైతులకు భవిష్యత్‌లో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకే ప్రతి రైతు తన పొలంలో ఫారంపాండ్ నిర్మించుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. మంగళవారం టేకులపల్లి మండలం బోడు గ్రామ పంచాయతీ రైతు సమ్మయ్య ఫారంపాండ్ పనిని పరిశీలించిన కలెక్టర్ కూలీలతో పాటు సరదాగా 45నిమిషాలు పనిచేశారు. అలాగే పక్కనే జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం వందరోజుల పని పూర్తి చేసుకోవాలని, ప్రతి రోజు కూలి రూ.300 కొలతల ప్రకారం పని చేసుకోవాలని సూచించారు. అనంతరం యాదగిరి, రవి, శ్రీను సాగు చేస్తున్న 6ఎకరాల మునగ తోటను పరిశీలించి వారితో మాట్లాడి సంతృప్తి వ్యక్తంచేశారు. ఎర్రాయిగూడెంలో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన గుగులోత్ శాంతి, బీమ్లాకు చెందిన పశువుల షెడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన, ఎంపీడీవో జి.రవీందర్, ఎంపీవో గాంధీ, ఏవో అన్నపూర్ణ, ఏపీవో శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, టీఏ ఈశ్వరి, ఎఫ్ ఏలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

జూలూరుపాడు : పీహెచ్‌సీ ఎదుట ధర్నా

దమ్మపేట : ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆశా కార్యకర్తలు

దుమ్ముగూడెం : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

బూర్గంపహాడ్‌లో ఫ్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

ములకలపల్లిలో నిరసన తెలుపుతున్న నాయకులు

చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఆశా కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులతో కలిసి ఆశా కార్యకర్తలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, సీపీఎం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.18 వేలు వేతనం చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు వారిపై అక్రమంగా కేసులు బనాయించారని అన్నారు. కేసులను వెంటనే ఎత్తివేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దుమ్ముగూడెం మండలం ములకపాడు సెంటర్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ములకలపల్లి మండల కేంద్రంలోని సెంటర్‌లో ప్రధాన రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఫ్లకార్డులు చేతబూని ఆశాలు నిరసన వ్యక్తం చేశారు. – నమస్తే నెట్‌వర్క్

పెద్దవాగు బ్రిడ్జి వద్ద ట్రాలీ బోల్తా
30 మంది కూలీలకు గాయాలు

బోల్తాపడిన ట్రాలీ ఆటో

జూలూరుపాడు, మార్చి 25 : మండల పరిధిలోని బేతాళపాడు గ్రామ సమీపంలో పెద్దవాగు బ్రిడ్జి వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 36మంది కూలీలతో వెళ్తున్న టాటామ్యాజిక్(ట్రాలీ ఆటో) బ్రిడ్జిపై నుంచి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 30మంది కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఒకరిని వరంగల్, మరొకరిని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడు మండలంలోని చీపురుగూడెం, టాక్యాతండా, ఏలకలోడ్డు, బాడవపోలు గ్రామాలకు చెందిన 36మంది కూలీలు ఖమ్మంజిల్లా ఏన్కూరు మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఓ రైతుకు చెందిన మొక్కజొన్న కంకులు కోసేందుకు ట్రాలీ ఆటోలో ఉదయాన్నే బయలుదేరారు. ఈ క్రమంలో బేతాళపాడు పెద్దవాగు సమీపంలోని బ్రిడ్జిపైన గుంతలో ముందు టైరు ఢీకొని వాహనం అదుపు తప్పి వాగులోకి దూసుకెళ్లి పైనుంచి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బేతాళపాడు సమీప గ్రామాలకు చెందిన వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో సోడెం శేఖర్ పరిస్థితి విషమంగా ఉండడంతో వరగంల్ ప్రభుత్వాసుపత్రికి, బానోత్ సురేష్‌కి తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాధావత్ రవి పేర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి 108లో తరలించారు.

కాయ కల్ప బృందం పర్యటన

ఇల్లెందు, మార్చి 25 : ఇల్లెందు వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిని కాయ కల్ప వైద్య బృందం డాక్టర్ బాలూనాయక్ ఆధ్వర్యంలో సందర్శించారు. మంగళవారం ఇల్లెందు ప్రభుత్వ హాస్పటల్‌ను వైరా ప్రభుత్వ హాస్పటల్ డాక్టర్లు, సిబ్బంది బృందం సందర్శించారు.

వడదెబ్బతో రైతు మృతి

టేకులపల్లి, మార్చి 25: వడదెబ్బతో రైతు మృతిచెందిన ఘటన కొండంగలబోడు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మద్రాస్‌తండా పంచాయతీ కొండంగలబోడుకు చెందిన కేశోత్ గోబ్రియా(49) ఎండలో చేల్లో పనులు చేస్తూ నీరసపడిపోయాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన గోబ్రియా ఇంటివద్దనే మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా అమరనేని

కొత్తగూడెం టౌన్, మార్చి 25 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్‌గా అమరనేని రామారావు, కన్వీనర్‌గా సంగం వెంకటపుల్లయ్య నియమితులయ్యారు. మంగళవారం స్థానిక పెన్షనర్స్ భవనంలో తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్ల జేఏసీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు వీరి నియామకాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు.

అఫ్రిడ్‌కు సన్మానం

టేకులపల్లి, మార్చి 25 : జూనియర్ సహాయ అధికారి అఫ్రిడ్ గ్రూప్ వన్‌లో మంచి మార్కులు, మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినందుకు మంగళవారం సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగభవాని ఆధ్వర్యంలో శాలువా కప్పి సత్కరించారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన భద్రాచలం జడ్జి

విద్యార్థులతో మాట్లాడుతున్న భద్రాచలం జడ్జి శివనాయక్

బూర్గంపహాడ్, మార్చి 25: మండల పరిధిలోని తాళ్లగొమ్మూరులోని జీఎస్ఈఎల్‌సీటీఎఫ్‌టీ హాస్టల్‌ను భద్రాచలం ఫ్లస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ మంగళవారం తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకుని మెనూ ప్రకారం భోజనం అందుతుందా.. వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహం నిర్వాహకులు విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. భద్రాచలంలోని పోస్ట్‌మెట్రిక్ డిగ్రీ గిరిజన బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేసి మెనూ సరిగా అమలు కావడం లేదని తన దృష్టికి వచ్చిందని, వార్డెన్, సిబ్బంది ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది ఉన్నారు.

పంట పొలాల్లో సీసీ కెమెరా ఏర్పాటు

పంట పొలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

అశ్వాపురం, మార్చి 25: ఇప్పటి వరకు సీసీ కెమెరాను వీధులు, దుకాణాలు, ఇళ్లలోనే చూశాం.. దొంగతనాలు, ప్రమాదాలను పసిగట్టేందుకు వినియోగించే ఈ నిఘానేత్రం ఇప్పుడు పంట పొలాలకు విస్తరించింది. ఓ మహిళా రైతు తన కూరగాయల చేనులో సోలార్‌తో సీసీ కెమెరా అమర్చుకున్నారు. మహిళా రైతు పడిదం వరలక్ష్మి మాట్లాడుతూ.. నీళ్ల మోటర్, దిగుబడి వచ్చే సమయంలో కొందరు దొంగలు పంటను ఎత్తుకుపోతుండడంతో నష్టపోతున్నామని, వారి నుంచి పంటను కాపాడుకునేందుకు పొలంలో సీసీ కెమెరా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏటీపీ నిర్మాణ పనుల పరిశీలన

మణుగూరు టౌన్, మార్చి 25: మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణ పనులను మంగళవారం ఆర్‌డీడీ సీతారాములు పరిశీలించారు. ఏటీసీ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, నిర్మాణంలో సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఐటీవో రవి, సూపరింటెండెంట్ జ్యోతిరాణి, వీటీవోలు జీవీ కృష్ణారావు, శ్రీనివాసరావు, నరసయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

రోడ్డుపై నిరసన తెలుపుతున్న మహిళలు

మణుగూరు టౌన్, మార్చి 25: అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా తమ గోడు పట్టడం లేదు.. రోజూ వందల సంఖ్యలో లారీలు తిరగడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే ఈ అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మణుగూరు మండలంలోని రాజుపేట గ్రామ మహిళలు నిరసన బాట పట్టారు. మంగళవారం మణుగూరు సింగరేణి రోడ్డుపై బైఠాయించారు. వెంటనే ఈ రవాణాను నిలిపివేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో అనిత, మణెమ్మ, పూజిత, లక్ష్మి, కల్యాణి, గోపమ్మ, సుహాసిని, కృష్ణవేణి పాల్గొన్నారు.

బీటీపీఎస్ క్రీడాకారుల ప్రతిభ

మణుగూరు టౌన్, మార్చి 25: ఐదు రోజులుగా కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు చెల్పూర్‌లో జరిగిన ఇంటర్ ప్రాజెక్టు క్రికెట్ టోర్నమెంట్‌లో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్) మణుగూరు క్రీడాకారులు సత్తా చాటారు. హోరాహోరీగా జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో తలపడి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బీటీపీఎస్ సీఈ బిచ్చన్న జట్టు క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

గొత్తికోయలకు చీరెలు పంపిణీ

ములకలపల్లి, మార్చి 25 : మండలంలోని కొమరంభీంనగర్ గ్రామంలో వలస గొత్తికోయలకు మంగళవారం చీరెలు పంపిణీ చేశారు. సినీహీరో రాంచరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమాని ఖాసీం ఎస్సై రాజశేఖర్ చేతుల మీదుగా 35మందికి చీరెలు అందించారు.

పదో తరగతిలో అందరూ ఉత్తీర్ణత సాధించాలి

ములకలపల్లి, మార్చి 25 : పదో తరగతి పరీక్షలు మంచిగా రాసి అందరూ ఉత్తీర్ణత సాధించాలని ఎస్ఎస్సీ ప్రత్యేక అధికారి రమణయ్య అన్నారు. మంగళవారం ములకలపల్లి మండలంలోని కమలాపురం ఏహెచ్ఎస్‌ను ఆయన సందర్శించారు. మంచి మార్కులతో పాస్ అయి పాఠశాల, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ములకలపల్లి, మార్చి 25 : మండలంలోని పూసుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన అర్వపల్లి సత్యనారాయణ దంపతులను టీఎస్‌యూటీఎఫ్ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లా కార్యదర్శి బి.రాజు, కిషోర్ సింగ్, కృష్ణ, మల్లంపాటి వెంకటేశ్వర్లు, పారుపల్లి నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, కిషోర్, అశోక్, జి.భాను పాల్గొన్నారు.

బ్రిడ్జిపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

భద్రాచలం, మార్చి 25: భద్రాచలంలోని సీతారామనగర్ కాలనీకి చెందిన సాయి (40) మంగళవారం గోదావరి బ్రిడ్జి మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం బ్రిడ్జి మీదకు వచ్చి బ్రిడ్జి మీద నుంచి దూకడంతో సమీపంలోని వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నీటిపారుదల శాఖ ఏఈగా జానీ

భద్రాచలం, మార్చి 25: భద్రాచలం నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎస్‌కే జానీ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవో నాయకులు ఆయన్ను కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జానీ మాట్లాడుతూ.. భద్రాచలంలో బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందని తెలిపారు. నీటిపారుదల శాఖ జిల్లా కార్యదర్శి సామాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ బాలకృష్ణ, కోశాధికారి పడిగ నరసింహారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను అరికట్టాలి

ఆళ్ళపల్లి, మార్చి 25: మండలంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను అధికారులు అరికట్టాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి గొగ్గెల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మర్కోడు పంచాయతీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రం ఆళ్ళపల్లి సీసీ రోడ్డు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తున్నారని, వాటిని అధికారులు గుర్తించి విచారణ జరిపి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా 'మైనింగ్ మూమెంట్స్ 25'

కొత్తగూడెం గణేష్‌టెంపుల్, మార్చి 25 : ప్రతి విద్యార్థి జీవితంలో కాలేజీ రోజులు ఒక మధురమైన జ్ఞాపకాలని కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రావు, సింగరేణి జీఎం కనకయ్య అన్నారు. మంగళవారం కేఎస్ఎం కళాశాల మైనింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో 'మైనింగ్ మూమెంట్స్ 25' పేరుతో కార్యక్రమం నిర్వహించారు. సింగరేణి జీఎం క్వాలిటీ కనకయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు రవికిరణ్, కోటయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ జన్మోత్సవ్

కొత్తగూడెం టౌన్, మార్చి 25 : కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనీనా ఆధ్వర్యంలో కూలీ లైన్ 6వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బేటీ జన్మోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఇటీవల జన్మించిన చిన్నారులను ఆశీర్వదించారు. ఒక్కొక్కరికి ప్రాక్, స్వీట్లు, కానుకలు అందించారు. కార్యక్రమంలో టీచర్లు పద్మ, ప్రసన్న పాల్గొన్నారు.

క్రీడాపాఠశాలలో ప్రవేశానికి పోటీలు

పాల్వంచ రూరల్, మార్చి 25 : కిన్నెరసాని క్రీడా పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 26, 27వ తేదీన తుది క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ ఆఫీసర్ బొల్లి గోపాల్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పాఠశాలల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు బాలురకు ఈ నెల 26న కిన్నెరసానిలో, బాలికలకు 27న కాచనపల్లి పాఠశాలలో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

అన్నపురెడ్డిపల్లి, మార్చి 25 : బెట్టింగ్‌లకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని అన్నపురెడ్డిపల్లి ఎస్సై చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ యువత బెట్టింగు మోజులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. బెట్టింగ్ యాప్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, మొబైల్‌ఫోన్‌లో బెట్టింగ్ యాప్‌లు ఉంటే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

దమ్మపేట రూరల్, మార్చి 25 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒకటి ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలను వెంటనే ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు రాము డిమాండ్ చేశారు. దమ్మపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించి నాయబ్ తహసీల్దార్ వాణికి వినతిపత్రం అందజేశారు.

టేకులపల్లి సంత@ రూ.11.60లక్షలు

టేకులపల్లి, మార్చి 25 : టేకులపల్లి మండల కేంద్రంలోని వారాంత సంత వేలం పాటను రూ.11లక్షల 60 వేలకు మూడ్ వాసు సొంతం చేసుకున్నారు. మంగళవారం టేకులపల్లిలో ఎంపీవో గణేష్ గాంధీ అధ్యక్షతన ఎంపీడీవో రవీందర్‌రావు సమక్షంలో సంత వేలం నిర్వహించారు. టేకులపల్లి గ్రామ పంచాయతీ పరిధి మూడ్‌తండా గ్రామానికి చెందిన మూడ్ వాసు సంతను సొంతం చేసుకున్నారు.

ఇండ్లులేని నిరుపేదల నిరాహార దీక్ష

ఇల్లెందు రూరల్, మార్చి 25 : మండల పరిధిలోని సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీ శివారులో ఇండ్లులేని నిరుపేదలు మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేశారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు ఏజే రమేష్ దీక్షలను ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే దిగి వచ్చి గుడిసెవాసులకు ఇండ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇండ్లు వేగంగా నిర్మించుకోవాలి

పాల్వంచ రూరల్, మార్చి 25 : లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా నిర్మించుకోవాలని హౌజింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ అన్నారు. పాల్వంచ మండలంలో నిర్మాణంలో ఉన్న 70 ఇందిరమ్మ ఇండ్లను మంగళవారం ఆయన పరిశీలించారు.

రికార్డుస్థాయిలో బొగ్గు రవాణా

రామవరం, మార్చి 25 : సింగరేణి కొత్తగూడెం ఏరియా ఒక్కరోజుకు గాను 68,056 టన్నుల బొగ్గు రవాణా చేసి ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా బొగ్గు రవాణా చేసినట్లు ఏరియా జీఎం శాలెంరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైలుమార్గం ద్వారా 14 రేకుల